క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జామి: తాండ్రంగి 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ దేముడుబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్‌లో మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో లక్ష్మీపురం, పావాడ, జాగరం, చింతాడ, తానవరం, విజినిగిరి, కొట్టాం, అప్పన్నపాలెం, ఆలుగుబిల్లి, తాండ్రంగి గ్రామలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేత్ర శస్త్ర చికిత్సలకు 36మంది ఎంపిక


వృద్ధుడికి కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ సత్యవతి

మెరకముడిదాం: వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో సహయస్ఫూర్తి ఫౌండేషన్, శంకర్ ఫౌండేషన్‌ల సౌజన్యంతో గురువారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 87 మందికి విశాఖపట్నా నికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సిబ్బంది నేత్రపరీక్షలు చేసి 36 మందిని కంటి ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. వీరికి త్వరలో ఉచితంగా నేత్రశస్త్ర చికిత్సలు చేయిస్తామని శంకర్ ఫౌండేషన్ క్యాంప్ ఇన్‌చార్జి సీహెచ్.వెంకటరమణ తెలిపారు. శంకర్ ఫౌండేషన్ సిబ్బంది సాయి కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి అజిత్‌బాబు, సిబ్బంది రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, తదితరులు

బొండపల్లి: మండలంలోని రోళ్లవాక గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలను మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గాప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధి దారులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తోందని చెప్పారు. నిర్మాణాల దశల ఆధారంగా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. నిర్మాణాలకు డబ్బులు అవసరం అయితే బ్యాంకుల నుంచి రుణం పొందవచ్చని సూచించారు. జగనన్న కాలనీల్లో పట్టాలు పొందిన వారి పేరిట ప్రభుత్వం ఉచితంగా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయిస్తోందని చెప్పారు. ఎంపీడీఓ ఎస్.హరిహరరావు, హౌసింగ్ జేఈఈ గంగాధర్, అంబటివలస ఎంపీటీసీ తాళ్లపూడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల గోపాలరావు, తాళ్లపూడి అప్పలనాయుడు, సుంకరి రాము నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువత

చీపురుపల్లిరూరల్: ఆశయ యూత్ అసోసియేషన్ వార్షికోత్సవం నేపథ్యంలో చీపురుపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 20 మంది యువకుల నుంచి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది రక్తం సేకరించారు. ఈ సందర్భంగా ఆశయ అసోసియేషన్ అధ్యక్షు డు రెడ్డి రమణ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన వారంతా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. రక్తదానం సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. ఆశయ సంస్థ ప్రతినిధులు మణికంఠ, మన్మదరావు తదితరులు పాల్గొన్నారు.

అభినందన


విద్యార్థినులను అభినందిస్తున్న సర్పంచ్ వెంకటరావు, ఉపాధ్యాయులు

దత్తిరాజేరు: 'ఆడుదాం–ఆంధ్రా' బాలికల క్రికెట్ పోటీల్లో షికారుగంజి మోడల్ స్కూల్ జట్టు జిల్లాస్థాయిలో ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. విద్యార్థినులను ఆ గ్రామ సర్పంచ్ వెంకటరావు, ఉపాధ్యాయులు పాఠశాలలో గురువారం అభినందించారు. ఈనెల 13 నుంచి విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి చింతలేదు

- చింతపల్లిపేట సచివాలయం పరిధిలో రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు చేకూరిన లబ్ధి రూ.6.89 కోట్లు
- నాన్ డీబీటీ కింద రూ.2.79 కోట్ల మేర లబ్ధి





చింతపల్లిపేట గ్రామ సచివాలయం


చింతపల్లిపేటలో వేసిన సీసీరోడ్డు



చింతపల్లిపేట రైతు భరోసా కేంద్రం

గుర్ల:

చింతపల్లిపేట సచివాలయ పరిధి గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ను నెలకొల్పారు. చింతపల్లి పేట, అచ్యుతాపురం పంచాయతీలకు కలిపి చింతపల్లిపేటలో సచివాలయం ఏర్పాటు చేశారు.


అచ్యుతాపురంలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

సీఎం జగన్ పరిపాలనలో తీసుకువచ్చిన సంస్కరణల ఫలితంగా గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తుండగా..సంక్షేమం విషయంలో ప్రజలకు చింతే లేదు. చింతపల్లిపేట సచివాలయ పరిధిలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ చింతపల్లిపేట, అచ్యుతా పురం, చుక్కపేట గ్రామాల్లో అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. గత ప్రభుత్వం కంటే మెరుగ్గా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈసచివాలయం పరిధిలో ఇప్పటి వరకు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులను చేశారు. రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.21.8 లక్షలతో రైతు భరోసా కేంద్రం భవనం నిర్మించారు. జగనన్న లేఅవుట్‌ను ఏర్పాటు చేసి 16 మందికి ఇళ్ల పట్టాలు అందజేసి, ఇళ్లు మంజూరు చేశారు. అలాగే సొంత స్థలాలు ఉన్న 24 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేశారు. వీరికి ఇళ్ల నిర్మాణ నిమిత్తం రూ.72 లక్షలను ప్రభుత్వం బిల్లుల రూపంలో కేటాయించింది. చింతపల్లిపేటలో రూ.63 లక్షలతో ఇంటింట కుళాయిలు ఏర్పాటు చేశారు. మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన పనిలేకుండా అన్ని ప్రభుత్వ సేవలు స్థానికంగా ఉన్న గ్రామ సచివాలయంలోనే అందుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోనే సచివాలయం వద్ద సమస్యలు పరిష్కారం అవుతుండడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ పార్టీలకతీతంగా అర్హులకు వలంటీర్లు అందిస్తున్నారు. పథకాల రూపంలో సచివాలయ పరిధి ప్రజలకు నేరుగా రూ.6.89 కోట్లు అందగా, నాన్ డీబీటీ కింద రూ.2.79 కోట్ల మేర లబ్ధి చేకూరింది.


చింతపల్లిపేట జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లు

చింతపల్లిపేట సచివాలయ పరిధిలో ప్రజలకు పథకాల ద్వారా చేకూరిన లబ్ధి వివరాలు

పథకం	లబ్ధిదారులు	నగదు
అమ్మ ఒడి	136	రూ. 64,37,000
జగన్న విద్యాదీవెన	84	రూ.22,25,811
జగనన్న వసతిదీవెన	64	రూ.9,04,842
రైతు భరోసా	168	రూ.79,86,000
క్రాఫ్ ఇన్సూరెన్స్	01	రూ.6,28,141
సున్నా వడ్డీ (పంట రుణాలపై)	118	రూ.1,42,124
వైఎస్సార్ పెన్షన్ కానుక	262	రూ.2,61,16,500
వైఎస్సార్ చేయూత	139	రూ.62,62,500
వైఎస్సార్ ఆసరా	259	రూ.79,44,978
డ్వాక్రా సున్నా వడ్డీ	324	రూ.6,08,911
ఇళ్లు	40	రూ. 72,00,000
వాహనమిత్ర	08	రూ.2,30,000


చింతపల్లిపేటలో ఏర్పాటు చేసిన ఇంటింట కుళాయిలు

సమస్యలు పరిష్కారమయ్యాయి..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా గ్రామం ఎంతో అభివృద్ధి చెందింది. గ్రామంలో చాలా సమస్యలు ఈ ప్రభుత్వం వచ్చాక పరిష్కారమ య్యాయి. సీసీ రోడ్లు నిర్మించారు. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు వాటికి సొంత భవనాలు నిర్మించారు. ప్రస్తుతం ప్రభుత్వ సేవలన్నీ గ్రామంలోనే అందుతున్నాయి.

– జమ్ము అప్పలనాయుడు, చింతపల్లిపేట

అర్హులందరికీ పథకాలు



గ్రామంలో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయి. వలంటీర్లే ఇంటికి వచ్చి పథకాల కోసం దరఖాస్తు చేయించడంతో పాటు ఇంటి వద్దకే పథకాల ను అందిస్తున్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది చొరవ చూపుతున్నారు. పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం వల్ల కొంతమేరకు ఆర్థిక ఇబ్బందులు తొలగాయి.

– కాకి గౌరి, చింతపల్లి పేట

పోలింగ్ కేంద్రాల పరిశీలన


గజపతినగరం: పురిటిపెంట న్యూకాలనీలో మహిళకు ఫారం-7ను అందజేస్తున్న ఎన్నికల డీటీ సతీష్‌కుమార్


గంట్యాడ: నీలావతిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సురేంద్రనాయుడు

గజపతినగరం:

పురిటిపెంట న్యూకాలనీలోని పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కుమార్ గురువారం సందర్శించారు. విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్, మరుగుదొడ్లు, ర్యాంప్ తదితర సదుపాయాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్నం దున ప్రతీ పోలింగ్ కేంద్రంలో సదుపాయాలు ఉన్నదీ లేనిది పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాలనీలో ఆయన పర్యటించి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటుహక్కు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీ ఉన్న వారికి ఫారం-7, మార్పులు, చేర్పులు అవసరమైన వారికి ఫారం-8 అందజేశారు. ఆయన వెంట బీఎల్‌ఓ టి.దేవి తదిత రులు ఉన్నారు.

గంట్యాడ మండలంలో...

గంట్యాడ: మండలంలోని పలు గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పోలీసులు గురువారం పరిశీలించారు. నీలావతి, పెణసాం, జగ్గాపురం గ్రామాల్లో విజయనగరం రూరల్ సీఐ ఎం. శ్రీనివాసరావు, ఎస్‌ఐ సురేంద్రనాయుడు పర్యటించి, పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలను పరిశీలించారు.

108లో ప్రసవం

దత్తిరాజేరు: మండలంలోని గదబవలస గ్రామానికి చెందిన భారతి గురువారం 108లో ప్రస వించింది. 108 ఈఎంటీ గౌరినాయుడు, పైలెట్ చిన్నారావు తెలిపిన వివరాలు..భారతికి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది గ్రామానికి చేరుకొని గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మార్గం మధ్యలో ప్రసవించి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి,బిడ్డను గజపతినగరం సామాజిక ఆస్పత్రిలో చేర్పించామని, క్షేమంగా ఉన్నారని వారు తెలిపారు.

నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ


బొండపల్లి: డీ వార్మింగ్‌డే వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చలంనాయుడు, అధికారులు


జామి: జామి ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్‌ప్రేమ్‌కుమార్


వేపాడ: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు ,తదితరులు

వేపాడ: జాతీయ నులిపురుగుల నివారణ దినం(డీ వార్మింగ్ డే) సందర్భంగా 19 ఏళ్ల వయసు లోపు వారందరికీ నులిపు రుగుల నివారణకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ధరణి చెప్పారు. సంబంధిత కరపత్రాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సత్యవంతుడు గురువారం ఆవిష్కరించారు. వైద్యాధికారి మాట్లాడుతూ వేపాడ పీహెచ్‌సీ పరిధిలో 4,352 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఒకటి నుంచి రెండేళ్ల వయసు లోపు పిల్లలకు అర్ధ మాత్ర, 3 నుంచి 19 ఏళ్ల లోపు వయసు వారికి 400 ఎంజీ మాత్రను మధ్యాహ్నం భోజనం తర్వాత ఇవ్వనున్నామన్నారు. జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ సన్యాసినాయుడు, సీహెచ్‌ఓ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

బొండపల్లి: డీ వార్మింగ్‌డే సందర్భంగా శుక్రవారం నిర్వహించనున్న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది విజయవంతం చేయాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు, మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గాప్రసాద్ కోరా రు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. తహసీల్దార్ పి.హరి, ఎంపీడీఓ ఎస్. హరిహరరావు, దేవుపల్లి, బొండపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు ఎల్.సత్యనారాయణ, ఏ.షర్మిల, బి.నారాయణఅప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

జామి: నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జామి పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యు కేటర్ ఎస్.అనిల్‌ప్రేమ్ కుమార్ గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత లోపించిన పిల్లల కడుపులో నులిపురుగులు పెరుగుతాయన్నారు. వీటి వల్ల రక్తహీనత, ఆకలి లేకపోవడం, కడుపు నొప్పి, బలహీనంగా తయారు కావడం, తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. గోళ్లను చిన్నవిగా శుభ్రంగా ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయరా దని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు.నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను శుక్రవారం పంపిణీ చేస్తామని, ఆరోగ్య సమస్యలు లేనివారంతా వీటిని వేసుకోవాలని సూచించారు. హెచ్‌ఎం అబ్దుల్ రెహమాన్, ఆరోగ్య సహాయకురాలు లత పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు


ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

గజపతినగరం: స్థానిక గ్రామ సచివాలయం -2లో ఎంపీడీఓ పి.జయంతిప్రసాద్, తహసీల్దార్ సీహెచ్.వి.రమేష్ గురువారం తనిఖీలు నిర్వ హించారు. రికార్డులతో పాటు ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందితో వారు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అధికారుల వెంట స్థానిక వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు, నాయకులు కర్రి నానాజీ తదితరులు ఉన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి


అతిథి ఉపన్యాసం చేస్తున్న ఇంగ్లిష్ లెక్చరర్ రవీంద్రనాథ్

శృంగవరపుకోట: ఆంగ్లంపై పట్టు సాధిస్తే ఉపాధి మార్గాలకు డోకా లేదని విశాఖపట్నంలోని వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల భాష ఉపన్యాసకులు డాక్టర్ సి.వి.ఎస్.రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులను ఉద్దే శించి లెక్చరర్ రవీంద్రనాథ్ గురువారం అతిథి ఉపన్యాసం చేశారు. ప్రభావవంతమైన భావవ్యక్తీకరణ, ఆంగ్లభాష వాడుక, సరైన సమ యంలో సముచిత పదజాల ప్రయోగంపై పట్టు ఉన్న వ్యక్తులు వారి రంగాల్లో ఎంతటి విజయాలు నమోదు చేశారో ఆయన ఉదాహర ణలతో వివరించారు. ఆంగ్లంపై పట్టు సాధించేందుకు కొన్ని మెలకువలు, కఠిన పదాలను గుర్తుంచుకునేందుకు సులభ పద్ధతులను తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరావు, అధ్యాపకులు డాక్టర్ వి.సుధీర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి


అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపీ చల్లా చలం నాయుడు

బొండపల్లి:

గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు సూచించా రు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం వివిధ శాఖల అధికారులతో ఆయన కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గ్రామ సచివాలయాలతో పాటు రైతు భరోసా కేంద్రాలు,హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయా లని చెప్పారు. జగనన్న లేఅవుట్లలో ఇళ్ల లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్లను సచివాలయాల్లో చేయించాలని, గ్రామాల్లో కులగణన పక్రియను పూర్తి చేయించా లని సూచించారు. పీఎం కిసాన్ పథకంలో భాగంగా ఆర్థిక సహాయం అందని రైతులను గ్రామాల వారీగా గుర్తించి వారికి సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఏఓ మల్లికార్జునరావును ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గా ప్రసాద్, తహసీల్దార్ పి.హరి, ఎంపీడీఓ ఎస్.హరిహరరావు, ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.

జపాన్ కంపెనీతో ఒప్పందం


మొక్కలు నాటుతున్న జపాన్ బృందం

లక్కవరపుకోట: ఎగుమతులకు సంబంధించి మండలంలోని శ్రీరాంపురం గ్రామ సమీపంలోని స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండి యా లిమిటెడ్ కర్మాగారంతో జపాన్‌కు చెందిన హన్వా మిడిల్ ఈస్ట్ ఎఫ్‌జెడ్‌ఈ కంపెనీ గురువారం ఒప్పందం చేసుకుంది. స్థానిక కర్మాగారంలో హన్వా మిడిల్ ఈస్ట్ ఎఫ్‌జెడ్‌ఈ కంపెనీ మేనేజింగ్ డైరక్టర్ టకొనో హిరోనోరీ బృందంతో స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా కర్మాగారం ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండి యా లిమిటెడ్ కర్మాగారం సీఎండీ బండి సతీష్‌కుమార్ మాట్లాడుతూ తమ కంపెనీ ప్రస్తుతం దుబాయ్ కేంద్రంగా వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తోందని, కంపెనీ ఎగుమతులను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడానికి ఒప్పందాలు కుదుర్చుకునేందుకు జపాన్ బృందం వచ్చిందని తెలిపారు. ఒప్పందాలపై ఇరు కంపెనీల ప్రతినిధులు సంతకాలు చేశారు. అనంతరం కర్మాగారం ఆవరణలో మొక్కలు నాటారు. స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా కర్మాగారం ఎండీ బండి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలు

కొత్తవలస: బాల్యవివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని ఐసీడీఎస్ సిబ్బంది అన్నారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో మండలంలోని మంగళపాలెం గ్రామంలో గురువారం కళాజాత నిర్వహించారు. ఆడ పిల్లలకు 18 ఏళ్లు నిండకుండాపెళ్లి చేయడం వల్ల కలిగే అనర్థాలను, దత్తత స్వీకారం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు కె.వి.స్వర్ణలత, కె.రమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం


ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు

వేపాడ:పదోతరగతి, ఇంటర్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని ఎంఈఓ జి.జగదీశ్వరరావు, ఎంఈఓ-2 బాలభాస్కరరావు ఉపాధ్యాయులకు సూచించారు.బక్కునాయుడుపేట మోడల్ స్కూల్‌ను గురువారం వారు సందర్శించారు. పదోతరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గరపడుతోందని శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. ఏదైనా సబ్జెక్టుల్లో సందేహాలు ఉంటే సంబంధిత ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలని చెప్పారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు, కేజీబీవీ ఎస్‌ఓ కిరణ్మయి, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు.